# ముంపు



కె.కె. మీనన్

రెండు రోజుల్నుంచీ చినుకూ, గాలీ - దానికితోడు వరద. నీళ్లు ! ఎక్కడ చూసినా నీళ్ళే !! ఏటిగట్టుకు అవతల వరద-ఇవతల వాన-ఊరంతా జలమయం.

నాయుడిగారి కొబ్బరితోట దగ్గిర ఏటిగట్టుకు ఊల (రంధ్రం) పడిందట. ఉదయం నుంచీ వూరంతా ఒకటే హడావుడి. వరదవైపు గట్టు తొక్కించటానికి రైతులంతా తలో మనిషిని పంపించారు. నాయుడిగారి పాలేరు వెంకన్న ఆ రోజంతా ఆ పని మీదే వున్నాడు. పొద్దున్నుంచీ మొలబంటి నీటిలో నిలబడి కసరత్తు చేసినట్టు తొక్కుతూనే వున్నాడు. ఇంజనీరుగారి పుణ్యమా అని అప్పుడే ఇంటికి వచ్చి ఒళ్ళు వాల్చాడు.

ఈదురుగాలి రయ్యిమని గుడిసెను దూసుకుపోతోంది. అప్పుడప్పుడూ గుడిసె వూగుతున్నట్టుకూడ అనిపిస్తోంది వెంకన్నకు. పక్క గుంటల్లోంచి నిద్రపట్టనీకుండా ఒకటే గోల చేస్తున్నాయి కప్పలు.

పొద్దున్న నాయుడిగారి ఇంటిదగ్గిర తిన్నదే తిండి. ఇంటికొస్తే తల్లి పొయ్యి రాజెయ్యకుండా ముడుచుకుని పడుకుంది.

"కూడొండలేదేంటే లమ్మా?" అనడిగాడు.

"గంజికైనా ఓ నూకగింజ లేదు. ఏం జెయ్యాల" అంది ముసిల్ది పడుకునే.

## స్వర్గంలో కూడా ఉపాధ్యాయులు తప్పరా

ఎన్నో ఏళ్ల ఉపాధ్యాయ వృత్తిలో వుండి ఓ సుప్రభాతాన కళ్యాణరావు గారు బాల్చీ తన్నేశారు. పుర ప్రముఖు లంతా శ్మశానంలో మేష్టారి సేవలను ఉగ్గడించారు. 'ఈ సరికి ఆయన స్వర్గంలో వాళ్ళకు పాఠాలు చెప్తూ వుంటారు' అన్నారొకరు. "బాబోయ్! మనం అక్కడకు వెళ్ళినా ఈయన పాఠాలు తప్పవన్నమాట" అన్నాడో రామలింగడు వెంటనే.

ఆకలి పేగుల్ని మెలి పెట్టేస్తుంటే, మోకాళ్ళు పొట్టకు తన్నిపట్టి ముడుచుకుని పడుకున్నాడు వెంకన్న.

ఆ రోజు పొద్దున్నే అడిగాడు నాయుడి గార్ని,

"ఈ నెలైనా జీతం ఇప్పించండి బాబయ్యా" అని.

"ఏంట్రోయ్! అప్పులోళ్ళాగా అడుగుతున్నావ్!! ఇక్కడేవయినా నీ బాబుగారి మూట వుందనుకున్నావేంటి ఇప్పించటానికి? పెళ్ళికి పట్టుకెళ్ళిన ఆరు బస్తాల అప్పు అలాగే వుండిపోయింది. నెలనెలా నీకు జీతం ఇచ్చుకుంటూపోతే అప్పెలా తీరుతుంది?" అని ఖయ్ మన్నాడు నాయుడు.

పెళ్ళి చేసుకున్నది ఒదిలిపెట్టి పోయి అప్పుడే రెండేళ్ళయింది. అప్పు మాత్రం అలాగే వుండిపోయింది. అప్పుడప్పుడూ పెరుగుతూ వుంటుంది కూడాను!

లేచిపోయిన పెళ్ళాన్ని గుర్తుచేసుకోటం ఇష్టంలేదు వెంకన్నకి.

"ఛీ, దీనమ్మ...యెదవ బతుకు" తనను తనే తిట్టుకున్నాడు.

"కాటికి కాళ్ళు చాచుక్కూర్చున్న ముసిల్దాన్నే ఇంకా కష్టపెట్టాల్సి వస్తోంది."

తల్లిని చూసి కళ్ళనీళ్ళెట్టుకున్నాడు వెంకన్న.

—వయసు చెల్లిపోయింది. జీవితంలో ఎన్నో కష్టాలుకాచి వడపోసిన అనుభవంతో తల ముగ్గుబుట్టయిపోయింది. ఎన్నో కన్నీళ్లు కార్చి, కార్చి- కళ్ళు గుంటలు పడిపోయాయి. బతుకు పోరాటంలో ఎన్నో ఎదురు దెబ్బలు తిని, తట్టుకుని, కాలం వేసిన కాటుకు కృశించి వయసుతోబాటే నడుం వంగిపోయింది. ఆ దశలోకూడ రెండుపూటలా- కాదు ఒక్కపూటయినా తిండి పెట్టలేని దౌర్భాగ్యం; ఆమె తనకు వండిపెట్టాల్సిన పరిస్థితి— ఇప్పుడు వండటానిక్కూడ గిద్దెడు గింజలులేని దీనావస్థ—

—తనొక్కడే కాదు, పేటపేటంతా అలాగేవుంది. అంతా అర్ధాకలితో అలమటిస్తున్నవాళ్లే!

ఒకపక్క గాదుల్లో మూలుగుతోన్న
ధాన్యసంపద
మరోపక్క ఆకలితో కనలి పోతోన్న
పేగుల రొద.

—ఆ ముందురోజే పేటలోని పదిమంది నాయుడిగారింటికి రాయబారం వెళ్లేరు.

"ఒచ్చే ఊడ్పుల్లో పనులుచేసి తీర్చేసుకుంటాం. తలో నాలుగుకుంచాల దాన్నెం ఇప్పించండి బాబూ, ఆకలితోటి పిల్లలు మాడిపోతున్నారు" అని వేడుకున్నాడు.

నాయుడుగారి దొడ్లో భద్రంగా వున్న రెండు పురుల్లోని ధాన్యం కలిసి కనీసం రెండువందల బస్తాలయినా వుంటుంది. వాటిని

చూడగానే వాళ్ళ నోళ్ళూరాయి. పేగులు తిండికోసం అరవటం మొదలెట్టాయి. కాని...

''అబ్బే! నాదగ్గిరెక్కడిదిరా ధాన్యం. అది మా అల్లుడిగారిది'' అని అబద్దమాడేడు నాయుడు. అబద్ధమాడ్డం అలవాటు కనుక అలాగన్నాడు నాయుడు. కాని నిజాన్ని పసి కట్టే నైతికబలం వున్నవాళ్ళకు అది పచ్చి అబద్ధంగానే అర్థమైంది.

పనుల రోజుల్లో అయితే బస్తాధర ఏ నలభయ్యో, యాభయ్యో ఉండవచ్చు. కాని ఇప్పుడో నూట నలభై!! అంత నష్టం భరించటం పాపం కష్టంకదూ మరి!!

ఏటిగట్టుమీది హడావుడి జోరుగానే వుంది. ఒచ్చిపోయే జీపుల సద్దు విన్పిస్తూనే వుంది. వరద నివారణ వుద్యమానికి బలంగా ఆవేళ ప్రత్యేక పోలీసు సిబ్బంది కూడా దిగింది.

దండోరా వేయిస్తున్నట్టున్నారు. రాముడి కంఠం వినబడుతోంది. పాపం పావలా డబ్బులకోసం వర్షంలో డప్పు కొడుతూ తిరుగుతున్నాడు రాముడు. వాడి అవసరం వాడిది. వర్షంలో డప్పు మోగకపోయినా తాటాకుమీద బాదినట్టు దబదబా చప్పుడు చేసుకుంటూ పోతున్నాడు.

వరద గంటగంటకూ పెరుగుతోందిట. గండిపడే ప్రమాదం కూడ వుందిట! కనుక అందరూ సురక్షిత ప్రాంతాలకు చేరాల్సింది— ఇదీ సమాచారం. మేలుకొలుపులు బాగానే వున్నాయి. ముంచుకొచ్చాక ఊరందర్నీ మేలుకోమనకపోతే, ముందుగా ఊరి నేతలే మేలుకుని వుంటే ఎంత బావుండును!! నాయుడు గట్టుపక్క తోటంతా తవ్వించి చేను చేస్తున్నప్పుడు వీళ్లంతా నిద్దరోతున్న ట్టున్నారు. గట్టుపక్కన తవ్వితే ఏటిగట్టు బలహీనపడుతుందనే సాంకేతిక సత్యం వాళ్లకు తెలీకనా?—

నాయుడు తోట తవ్వి చేను చేయించటానికి ఓ కథ వుంది.

నాయుడి కొబ్బరితోట వూరికి దగ్గర్లో వుంది. అది అన్నివిధాలా నివాస స్థలాలకి అనువుగా వుండటంవల్ల హరిజనులంతా ఇళ్ల స్థలాలకు దరఖాస్తు పెట్టుకున్నారు. లేబరు డిపార్టుమెంటువాళ్ళు కావల్సినంత పబ్లిసిటీ ఇచ్చి, తనిఖీకి అక్కడికి రాకముందే నాయుడు గుంటలు పెట్టించేశాడు. మరో రెండు నెలల్లో మొత్తం చేనే చేయించేశాడు—

—లేకపోతే, వూరిపక్క మాలపల్లా?—

వెంకన్నకు అప్పుడే కునుకు పడుతోంది. కాని బయటినుంచి నాయుడికంఠం మేలు కొలుపు పాడింది. ఉలిక్కి పడి బయటికొచ్చి నుంచున్నాడు వెంకన్న.

''ఎందుకైనా మంచిది. ధాన్యం గట్టుకు చేరేద్దాంరా'' అన్నాడు నాయుడు.

''నా నొక్కణ్ణేనాండి?''

''ఇంకెవళ్ళయినా వుంటే మంచిదే— పిలు పదిమందిని.''

పేటలో అందర్నీ అడిగేడు వెంకన్న. ప్రతివాడూ పదేసి కుంచాల ధాన్యం ఇస్తే వస్తామని కోరస్ పాడారు. అవును మరి! యీ పోటీ ప్రపంచంలో ఎవరి అవకాశాన్ని వారు సద్వినియోగం చేసుకోవాలి''.

ఆ మాట వినగానే బెంగ పడిపోయాడు నాయుడు.

వెధవది వాళ్లు అడిగినప్పుడే తలో నాలుగు కుంచాలు పడేస్తే కుక్కల్లా ఒచ్చి పడేవారెప్పుడు. ఛీ ఛీ— జీవితంలో మొదటి సారి తప్పుచేశాను అనుకున్నాడు. కాని ఓట

మిని అంగీకరించేటంత పిరికివాడు కాడు నాయుడు.

"వాళ్లు రాకపోతే పోయార్లే చావనీయ్. నువ్వే తంటాలుపడుదూగాని రా" అని లాక్కు పోయాడు వెంకన్నని.

చినుకూ గాలీ; చీకటి. నాయుడు మండువా అరుగుమీద నిలబడి పెట్రొమాక్స్ లైటు చూపిస్తున్నాడు. వెంకన్న పైకి ఎక్కి పురి మీద కప్పిన గడ్డి తీస్తున్నాడు. ఆ పని జరి గేది కాదని వెంకన్నకి తెలుసు. కాని అలా చెప్పే ధైర్యం లేదు అతనికి. చెప్పినా వినే సంస్కారమూ లేదు నాయుడికి.

వెంకన్న గంపలోకి ధాన్యం తవ్వు తున్నాడు. అంతే— పిడుగు పడ్డట్టు పెద్ద శబ్దం ఐ, మహాప్రళయంలా నీరు గర్జించటం మొదలెట్టింది.

"అయిపోయిందిరా వెంకా, గండి పడి పోయింది." గావుకేక పెట్టాడు నాయుడు.

ఊరంతా గోల, కేకలు——

ఎక్కడివి అక్కడే ఒదిలేసి ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని పడుతూ లేస్తూ పరు గెడుతున్నారు.

అకస్మాత్తుగా తల్లి గుర్తుకొచ్చింది వెంక న్నకి.

"బాబుగారూ, ముసిల్ది సచ్చిబోద్ది నానెల్లి పోతాను" అన్నాడు.

అంత కంగారులోనూ నాయుడి కోపం ఆకాశం తాకింది.

"గురిలేని లంజాకొడకా, ఇక్కడ నా పెళ్ళాంపిల్లలు చచ్చిపోతావుంటే అక్కడ చావుకు సిద్ధంగా వున్న నీ యమ్మని గట్టె క్కించటానికి వెళ్తావా?"

మరి నోరు లేవలేదు వెంకన్నకి. అంతటి స్వామిభక్తుడు. కాని గుండెల్లో గుబులు అతన్ని రంపపుకోత కోస్తోంది.

క్షణాలమీద వూరంతానీరు నిండిపోయింది... నాయుడి ఎత్తు మండువాలోగిలే మెట్లదాకా మునిగిపోయింది. అప్పటికే ప్రభుత్వం వారి రక్షణ డింగీలు వూరంతా చీకట్లో తారట్లాడు తున్నాయి. ఎక్కడో దూరాన ఓవర్సీరుదీ, లస్కరుదీ కంఠాలు విన్పించాయి. వాళ్ళని పిలిపించి సంసారాన్నంతా గట్టుకు చేర వేయించుకున్నాడు నాయుడు.

నీటి తాకిడికి ఓ మాదిరి ఇళ్ళన్నీ కూలి పోతున్నాయి. ఇళ్ళ పెల్లలు విరిగి నీటిమీద పడి బాంబుల్లా శబ్దం చేస్తున్నాయి. ఆ శబ్దాల తోటి యుద్ధరంగంలా వుంది వూరు.

నాయుడుగారి జనం అంతా సురక్షిత ప్రాంతం చేరాక, సామాన్లు చేరవేయించటం మొదలెట్టాడు.

"నాయుడుగారూ, పడవలన్నీ తమరే వాడుకుంటూ వుంటే ఊరంతా ఏమైపోతుం దండీ!" అనడిగాడు ఓవర్సీరు.

ఆత్మాభిమానం దెబ్బతిన్నట్టూ, తనకేదో తీరని అన్యాయం జరిగిపోయినట్టూ ఫోజు పెట్టాడు నాయుడు.

"మీరేనా ఆ మాట అంటున్నదీ?"

"ఆ పడవలు వూరందరి కోసంవున్నవండీ.. తంవరొక్కరికోసం వేగాదు."

"ఒహో, అయిందానికీ, కానిదానికీ మామూళ్లంటూ మమ్మల్ని దోచుకు తిన్న ప్పుడు ఈ నీతి ఏమైందండీ. ఇలాంటప్పుడు ఆదుకుంటారనేగా మేం మీకు చేసేది. పోస్లే అవన్నీ మర్చిపోతే ఇది దగ్గరుంచుకోండి".

ఓవర్సీరు గారి నోరు వెంటనే కట్టుబడి పోయింది. అయితే అతనికి పైనకూడ ఇంకా అధికార్లు ఉంటారనేది అప్పట్లో స్ఫురించ లేదు నాయుడికి. వాళ్లు డింగీలన్నిటినీ స్వా

పైకి తోలించేటప్పటికి గత్యంతరం లేక తనూ గట్టుకు చేరుకున్నాడు.

వెంకన్నమాత్రం అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది.

నావ తోయించుకుని వెళ్ళిపోయాడు నాయుడు.

క్షణ క్షణానికి నీరు పొంగుతోంది. రాత్రయేటప్పటికి నాయుడిగారి ఇల్లంతా మునిగిపోయింది. వెంకన్న ఇల్లెక్కి కూర్చొన్నాడు. తెల్లవార్లూ కంటికి రెప్ప వెయ్యకుండా కాపలా కాస్తున్నాడు పడిపోతున్న ఇళ్ళ చప్పుళ్ళు లెక్కపెడుతూ ఎన్ని ఇళ్ళు కూలిపోయాయో అంచనా వేసుకుంటున్నాడు.

అప్పుడప్పుడూ ఆకలి గుర్తు చేస్తోంది. కాని అమ్మ గుర్తుకు రాగానే ఆకలి చచ్చిపోయి గుండెల్లో దుఃఖం నిండుతోంది.

తెలతెలవారు తుండగా నాయుడుగారి దొడ్లో నీళ్ళు కదుల్తోన్న చప్పుడైంది.

"ఎవరదీ?" గద్దించాడు వెంకన్న.

ఎవరూ పలకలేదు. పడవల తెడ్లువేస్తున్న చప్పుడు స్పష్టంగా విన్పిస్తోంది. మెల్లగా దిగి కిందికి ఒచ్చాడు. దొడ్లో గుండెలలోతు నీరుంది. ఎలాగో నడిచి స్తంభం పట్టుకుని తేరిపార జూశాడు. నాలుగైదు పడవలు పురులచుట్టూ వున్నాయి. పదిమంది ధాన్యం త్రవ్వి పడవల్లో పోస్తున్నారు.

"ఒరే దొంగనాయాల్లారా! ఏంటిరా అది" అరిచాడు.

"నువ్వేనంటరా యెంకన్న... రా, రా, నువుకూడా ఓ సెయ్యెయ్యి"

"సెయ్యికాదురా మిమ్మల్నిసంపెయ్యాల" అంటూ కర్ర పుచ్చుకుని వెళ్ళబోయాడు. కాని ప్రవాహంలో నిలబడలేక అక్కడే వుండి పోయాడు.

గత 20 సంవత్సరాలలో మన దేశంలో 2,500 సార్లు పోలీసులు కాల్పులు జరిపారు. 1964 – 69 మధ్యగల 5 సంవత్సరాలలో ఆందోళనకు దిగిన ప్రజలను అణచివేయడానికి పోలీసులు 900 సార్లు ప్రయత్నించారు. ఆ ప్రయత్నాలలో 500 మంది మరణించారు... 2000 మంది గాయపడ్డారు.

ఇద్దరు మనుషులు వెంకన్నను పట్టుకుని కాళ్ళూ చేతులూకట్టి పడవలో పడేశారు.

"సిగ్గు లేదురా నీకు కుక్కలా ఇక్కడ కాపలా కాస్తున్నావా?"

"ఆకలితో సచ్చిపోతా వుంటే కుంచెడు గింజలు ఇవ్వటానికే చేతులు రాని ఆడి యింటికి కాపలా కాత్తన్నావా?"

"నీఅమ్మ ఏమైందో నీకేమైనాతెల్సురా?"

"మన పిల్లా పీసూ ఆకలితోటి మాడిపోతన్నారు. అడిగితే పిడికెడు గింజలు కూడ ఇవ్వడు నాయుడు. అవసరానికి మించి అంత ఎందుకు నాయుడికి?"

ఈ మాటలేం పట్టలేదు వెంకన్నకి.

పడవలో పెనుగులాడుతూనే వున్నాడు. ఇక సాధ్యంకాక నోటితో పోరాటం ప్రారంభించాడు.

"ఒరే కన్నమెయ్యకండిరా కల్లుపోతాయి దేముడు సెపిత్తాడ్రా" అంటూ మొదలెట్టాడు.

"దేముడూ లేదు దెయ్యమూలేదు. కాలే కడుపుకు కాత్తముద్ద దొరికితే అదే దేముడు. దానికి అడ్డం వొచ్చిన పెతి నాయాలా దెయ్యంవే".

అప్పటికే తెల్లవారిపోయింది బాగా.

అక్కడ గట్టుమీద కలెక్టర్ గారు నాయుడితో సంప్రదింపులు చేస్తున్నారు.

"నాయుడుగారూ ఈ రోజున ఏ మిల్లరైనా మీ ధాన్యం నూటనలభై రూపాయలకు కొనుక్కునే మాట నిజమే. కాని ఇప్పటి పరిస్థితివేరు. ఇది ప్రజాహిత కార్యం. ఎంతో కొంతతగ్గించి కాస్త ప్రజాసేవ చేయండి."

"తమరు చెపుతున్నారు గనక తప్పదు. ఆ వందరూపాయలకు ఖాయం చేసుకోండి" అనేశాడు నాయుడు.

పెద్దపెద్ద పడవల్లో ధాన్య సేకరణకు బయల్దేరేరు. వీరికి సహాయంగా ప్రత్యేక పోలీసుదళం కూడా బయల్దేరింది.

వీరంతా నాయుడిగారి ఇల్లు చేరేటప్పటికే అక్కడి పడవలు ధాన్యంతో కదల బోతున్నాయి. వాళ్లు తొందరగా పడవలు తోసుకుని పోడానికి ప్రయత్నించారు. కాని వీలు పడలా. పోలీసులు గాల్లోకి తుపాకులు కాల్చేటంతో భయపడి లొంగిపోయారు.

"వీడెవడు?" కాళ్లూ చేతులూ కట్టేసి పడవలో పడి వున్న వెంకన్ననుచూసి అడిగారు కలెక్టర్ గారు.

"వీడూ వాళ్లవాడేనండి".

"మరీ కట్టు తాళ్ళేంటి?"


"అంతా ఎత్తుగడ......" అన్నాడు నాయుడు.

అందరితోపాటు వెంకన్ననూ లాక్కుపోయారు పోలీసులు.

పడవలు పేటమీదుగా వెళ్తుంటే తన గుడిసె ఎక్కడుందో కళ్లతో వెతికాడు. ఎక్కడా ఆనవాలు కూడ దొరకలేదు. తల్లి గుర్తొచ్చి ఆ వరద అంతా అతని గుండెల్లోనే సుడులు తిరుగుతున్నట్టు బాధపడ్డాడు. మోకాళ్లలో తలపెట్టి మూగ దుఃఖం అనుభవించాడు. *


**రు. 10,000 లు విలువగల బహుమతులు గెలవండి**

(ప్రవేశం ఉచితం)



రు. 10,000 ల బహుమతులను - టెలివిజన్, స్కూటర్, ట్రాన్సిస్టర్స్, చీరలు, వాచీ, కెమెరా మొదలైనవి ఉచితపోటీలో గెలుచుకోండి. ఇది కేవలం ప్రచారం కొరకే. ప్రశ్న: ఈ ఖాళీగళ్ళను 20 (ఇరవై) నుంచి 28 (ఇరవై ఎనిమిది) వరకు గల అంకెలతో పూరించండి. ఎటునుంచికూడినా మొత్తం (72) (డెబ్భై రెండు) వచ్చేట్టు అంకెలను వేయాలి. ఒక అంకెను ఒక్కసారే ఉపయోగించాలి.

చివరితేదీ: **14-9-1976** ఫలితాల ప్రకటన: **16-9-1976**

జవాబును తెల్లకాగితంమీద మీపూర్తి చిరునామా ఇంగ్లీషులేక హిందీలోపిన్‌కోడ్‌తో సహా వ్రాసి పంపించండి. ఒక కుటుంబంనుంచి ఒక సమాధానం మాత్రమే అంగీకరించబడుతుంది. ప్రతి పోటీదారు పోటీ నియమ నిబంధనల ననుసరించి బహుమతులు పొందగలరు. తుదినిర్ణయం మా నియమ నిబంధనలప్రకారం తీసుకోబడుతుంది. మొట్టమొదట మాకుచేరిన ఎంట్రీకి అదనంగా రు.100 లభిస్తాయి. ఉచిత ఫలితాల కోసంవ్రాయండి.

THE ADVERTISEMENT MANAGER,
**INTERNATIONAL AGENCIES**
D/A-361, Laxmi Nagar, DELHI-110 051